# కోర్టుల చుట్టూ హెచ్‌సీఏ పంచాయితీ

○ వన్-మ్యాన్ కమిటీపై క్లబ్‌ల తీవ్ర అభ్యంతరం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో సాగుతున్న అంతర్గత పోరు, ఆర్థిక అక్రమాల వ్యవహారం ఇప్పుడు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ముందుకు చేరింది. అసోసియేషన్ వ్యవహారాలను పర్యవేక్షించడానికి సింగిల్ మెంబర్ కమిషన్‌ను నియమించడంతో పాటు, భారీ ఎత్తున జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఆర్థిక అక్రమాలపై ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పలు క్రికెట్ క్లబ్‌లు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ అప్పీళ్లపై బుధవారం విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.హరిప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్.. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని హెచ్‌సీఏను, పిటిషనర్లను ఆదేశించింది. గతంలో హెచ్‌సీఏలో నిధుల దుర్వినియోగం, ఆర్థిక అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. రాష్ట్ర సీఐడీ ద్వారా 'సిట్' ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ఈ దర్యాప్తు ముగిసే వరకు హెచ్‌సీఏ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ. నవీన్ రావును వన్‌మ్యాన్ కమిటీగా నియమించారు.

అయితే, ఈ నిర్ణయాన్ని ఎస్.ఎ.అంబర్‌పేట్ క్రికెట్ క్లబ్, జిందా తిలిస్మాత్ క్లబ్, సాగర్ క్రికెట్ క్లబ్‌లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అప్పీలు చేసిన క్లబ్‌ల తరపున సీనియర్ కౌన్సెల్ పి. రఘురామ్ వాదనలు వినిపిస్తూ.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమిటీని పక్కన పెట్టి, పరిపాలనను పూర్తిగా కోర్టు నియమించిన కమిటీ చేతుల్లోకి తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఎవరో కొందరు చేసిన తప్పులకు మొత్తం కమిటీని బాధ్యులను చేయడం సరికాదని, కోర్టుల జోక్యం కేవలం నేరారోపణల దర్యాప్తు వరకే పరిమితం కావాలని ఆయన ధర్మాసనానికి విన్నవించారు. ఈ న్యాయపోరాటాల వల్ల అసలైన క్రికెట్ ఆనందం ఇప్పుడు మైదానాల నుంచి కోర్టుల చుట్టూ తిరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు హెచ్‌సీఏ తరపున హాజరైన న్యాయవాది ఈ అప్పీళ్లను తోసిపుచ్చారు. అసోసియేషన్‌లో మొత్తం 150కి పైగా సభ్య క్లబ్‌లు ఉంటే, కేవలం 11 క్లబ్‌లు మాత్రమే ఇప్పుడు కోర్టు ముందుకు వచ్చాయని గుర్తుచేశారు. ఈ విచారణల గురించి సభ్య క్లబ్‌లన్నింటికీ ముందే తెలుసని, అప్పుడు స్పందించకుండా ఇప్పుడు అభ్యంతరాలు చెప్పడం సరికాదని వాదించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అసోసియేషన్ ప్రక్షాళనకు



అవసరమని హెచ్‌సీఏ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఇరుపక్షాల వాదనలు విన్న డివిజన్ బెంచ్.. సింగిల్ జడ్జి ముందు పిటిషన్ వేసిన సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్‌ను కూడా కౌంటర్ దాఖలు చేయాలని కోరింది. అప్పీలు చేసిన క్లబ్‌లకు ఈ కౌంటర్లపై సమాధానం ఇవ్వడానికి వారం రోజుల సమయం ఇస్తూ, తదుపరి విచారణను జూలై 21కి వాయిదా వేసింది. హెచ్‌సీఏలో గత కొద్ది రోజులుగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. జూన్ 8న హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అమర్‌నాథ్ నియామకాన్ని హైకోర్టు రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఆ పదవికి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిస్తూనే, కొత్త అధ్యక్షుడు ఎన్నికయ్యే వరకు వైస్ ప్రెసిడెంట్ దల్జీత్ సింగ్ తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరిస్తారని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సిట్ దర్యాప్తు, వన్‌మ్యాన్ కమిటీ పర్యవేక్షణపై జూలై 21న ధర్మాసనం వెలువరించే తీర్పు హెచ్‌సీఏ భవిష్యత్తును నిర్ణయించనుంది. తదుపరి విచారణ నాటికి ఇరుపక్షాల న్యాయవాదులు తమ కేసులకు సంబంధించిన పూర్తి సమగ్ర రికార్డులను సమర్పించాలని కోర్టు ఆదేశించింది.



## ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**విశ్వంభర, మీర్ పేట్ :** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్ జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 లో మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న ఇందిరమ్మ చీరలను టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా సామిడి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి మహిళకు చీర అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతికి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సామిడి చరణ్ రెడ్డి, కాట్నే పద్మ, రవీందర్ రెడ్డి, మట్ట సత్యనారాయణ, డ్వాక్రా సంఘం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 'రెడీ టూ సర్వ్' నిర్వాహకులు పెద్ది శంకర్‌కు సత్కారం




**విశ్వంభర, హైదరాబాద్ :** వీబీ ఎంటర్‌టైన్మెంట్స్ బొప్పన విష్ణు గారి ఆధ్వర్యంలో "ఫిల్మ్, టీవీ డైరెక్టరీ 2026 డిజిటల్ మీడియా అవార్డ్స్ వేడుకల్లో స్వచ్ఛంద సంస్థ 'రెడీ టూ సర్వ్' నిర్వాహకులు పెద్ది శంకర్‌ను సత్కారించారు. సమాజంలో అనాథలైన వృద్ధులను చేరదీసి, వారికి అండగా నిలుస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు అందిస్తున్న 'రెడీ టూ సర్వ్' స్వచ్ఛంద సంస్థ సేవలను ఈ సందర్భంగా వేదికపై ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు బొప్పన విష్ణు ఆయనకు రివార్డు అందించి ఘనంగా విజయ్ భాస్కర్ , అంబికా కృష్ణ శివ కంటమనేని , రాజశేఖర్ అనిగి , మాదాల రవి తదితరులు సత్కరించారు.

## రాజకీయ పార్టీ నాయకులతో సర్‌పై సమావేశం



**విశ్వంభర, సరూర్ నగర్ :** ఎల్.బి. నగర్ సర్కిల్13 పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల కోసం శిక్షణా కార్యక్రమం సరూర్‌నగర్‌లోని జ్యోతి క్లబ్‌లో నిర్వహించబడింది. సర్కిల్ 13 ఏ ఈ ఆర్ ఓ , డి సి బి. శ్రీనివాస్ ఏర్పాటు చేసి, జూన్ 25 నుండి చేపట్టనున్న (ప్రత్యేక ఓటర్ల నమోదు/సవరణ) ప్రక్రియ గురించి వివరంగా వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సర్కిల్ 13 ఏఎంసి ఎం.ఏ. ఖదీర్, ఎం. చంద్రశేఖర్ , కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 150 మంది బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం





**విశ్వంభర, చైతన్యపురి :** విద్యార్థులు సైబర్ నేరాలు , మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని చైతన్యపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదులు సూచించారు. అక్రమ మాదకద్రవ్యాల వినియోగం , రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం ప్రచారాల్లో భాగంగా బుధవారం తపస్య జూనియర్ కళాశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, నకిలీ ఉద్యోగ ఆఫర్లు వంటి సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు ఇతరులకు తెలియజేయకూడదని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు లేదా లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమంతంగా ఉండేందుకు 1930కి వెంటనే కాల్ చేసి వాటిని అరికట్టడానికి ప్రయత్నం చేయాలని సూచించారు.

## డివిజన్లోని సమస్యల పరిష్కారానికి కృషి

**- పున్నా గణేష్ నేత**

**విశ్వంభర, సరూర్ నగర్ :** ఆర్కె పురం డివిజన్ లో నీ సమస్యల పరిష్కారానికి మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ల దృష్టికి తీసుకువెళ్లి తన వంతు కృషి చేస్తారని ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ అన్నారు. వాసవి కాలనీ రోడ్ నెంబర్ 1/ఏ లో గత 20 సంవత్సరాల క్రితం వేసిన సీసీ రోడ్డు గుంతల మయంగా తయారై వర్షాకాలంలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా పాదచారులు కూడా చాలా ఇబ్బంది పడుతున్న దృష్ట్యా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తన దృష్టికి తీసుకురాగానే, సమస్య పరిష్కారం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్, పగడాల ఎల్లన్న, ,అసోసియేషన్ అధ్యక్షులు జెల్లా జగన్నాథం, కార్యదర్శి మల్లేష్‌యాదవ్ , లింగారెడ్డి, పురుషోత్తం గుప్త , శ్రీధర్ రెడ్డి ,భాస్కర్, సుధాకర్ శర్మ, సుధాకర్ గుప్తా, సూర్యనారాయణ గుప్త, సురేష్ గౌడ్, అచ్చయ్య, శ్రీధర్ పాల్గొన్నారు





నల్లగొండ జిల్లా, కనటల్లు మండలం, జి.యాడవెల్లి గ్రామంలోని ఎన్‌వీకే ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహానికి హాజరై నూతన వధూవరులు అనూష, సందీప్‌కుమార్‌లను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ, రాఘవేందర్, పరమేశ్, కృష్ణ, వెంకట్‌రెడ్డి తదితరులు.




## అర్హుడికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరాలి

○ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై ప్రత్యేక అధికారి డా. గౌరవ్ ఉప్పల్ సమీక్ష..

○ నల్గొండ జిల్లాలో కార్యక్రమాల అమలుపై అధికారులను అభినందించిన ప్రత్యేక అధికారి

**విశ్వంభర, నల్లగొండ :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రతి అర్హ లబ్ధిదారునికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి, నల్గొండ జిల్లా ప్రత్యేక అధికారి డా. గౌరవ్ ఉప్పల్ సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డా. గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. నల్గొండ జిల్లాలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసిన జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులను ఆయన అభినందించారు.ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని.పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య రక్షణకు మస్కిటో నెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లాలో 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల పురోగతిని వివరించగా, వివిధ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ శాఖల పనితీరును ప్రత్యేక అధికారికి వివరించారు.

## బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌కు బెయిల్

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇద్దరి పూచీకత్తులతో ఆయనకు బెయిల్ ఇచ్చింది. మే 26న తెలంగాణభవన్‌లో జరిగిన నిర్వహించిన సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడారు. అందులో నాంపల్లిలోని సింగరేణి భవన్‌తోపాటు మందమర్రిలోని జీఎం కార్యాలయ అధికారులను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీనిపై సింగరేణి భవన్ అధికారులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో పోలీసులు ఆయన్ను తెలంగాణ భవన్‌లో అరెస్టు చేశారు. ఈ కేసులో బాల్క సుమన్‌కు తాజాగా బెయిల్ మంజూరైంది.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం

ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశ్వంభర, నల్గొండ :** మంత్రి నల్గొండ జిల్లా, కనగల్ మండలం, ధరేవేశిపురంలో జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుంచి కల్యాణ మండపం వరకు మంత్రి మేళతాళాలతో ఊరేగింపు గా పట్టు వస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులతో కలిసి రేణుక ఎల్లమ్మ అమ్మవారి జమదగ్ని మహర్షి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని, జిల్లా ,రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా ఆశీర్వదించాలని మంత్రి కోరారు. దరవేశిపురం రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, ఆలయ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఈవో నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు .

## గద్వాల్ వీవర్స్ సొసైటీ శారీస్‌ను ప్రారంభించిన సుమా కనకాల, ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**విశ్వంభర, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 55లో పెద్దమ్మ తల్లి టెంపుల్ సమీపంలో గద్వాల్ వీవర్స్ సొసైటీ శారీ షాప్‌ను యాంకర్ సుమా కనకాల, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తోపాటు రాంగోపాల్ అగర్వాల్, ఆకాష్ అగర్వాల్ కలసి ప్రారంభించారు. భారతీయ చేనేత కళా సంపదను సంరక్షిస్తూ, నేత కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయాలనే లక్ష్యంతో 1986 లో శ్రీ రామ్ గోపాల్ స్థాపించిన గద్వాల్ వీవర్స్ సొసైటీ నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందిస్తోంది. గద్వాల్ ప్రాంతానికి చెందిన సాంప్రదాయ చేనేతకళను పరిరక్షిస్తూ, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ చేనేత సంప్రదాయాలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. సాంప్రదాయంగా గద్వాల్ చీరలు స్వచ్ఛమైన పత్తితో మాత్రమే నేయబడేవి. కాలానుగుణంగా వినియోగదారుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని, సంప్రదాయ నైపుణ్యాన్ని కొనసాగిస్తూ సిల్క్‌కాటన్ గద్వాల్ చీరలు, స్వచ్ఛమైన పట్టు గద్వాల్ చీరలను ప్రవేశపెట్టారని సుమ తెలిపారు. గద్వాల్ చేనేతతో పాటు దేశంలోని ప్రముఖ చేనేత సంప్రదాయాలను కూడా వినియోగదారులకు అందిస్తోంది. ఇందులో కాంచీపురం హ్యాండ్‌లూమ్ పట్టు చీరలు, పైఠాణీ, నారాయణపేట, పోచంపల్లి ఇకత్, ఉప్పాడ, జమ్దాని, బనారసీ తదితర ప్రసిద్ధ చేనేత కలెక్షన్లు కూడా చాలా బాగున్నాయి, తాను కూడా తమ కుటుంబ సభ్యుల కోసం రెండు శారీస్ కొన్నానని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తెలిపారు.



**ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 లో బి ఎల్ ఏ ల ముఖ్య నాయకుల సమావేశం టి పీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి నివాసంలో జరిగింది. అనంతరం సామిడి మాట్లాడుతూ బి ఎల్ ఓ లతో సహకరించి ఓట్లల్లో అవకాతావాకలు జరగకుండా చూడాలని ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సజావుగా సాగేలా ప్రతి ఒక్క అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.**
**( విశ్వంభర, మీర్ పెట్)**

## పెళ్లి ఖర్చులు తగ్గించి రూ.50 లక్షల విరాళం

**అభినందించిన కేటీఆర్**



**విశ్వంభర, బంజారాహిల్స్:** తన పెద్ద కుమారుడి వివాహ వేడుకల్లో అనవసర ఖర్చులను తగ్గించుకుని.. అనాథ, ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుల కోసం రూ.50 లక్షలను విరాళంగా అందించిన భారాస నేత అబ్దుల్ ముఖీత్ చందాను బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభినందించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. పెళ్లిలో అనవసర ఖర్చులను తగ్గించుకుని.. ఆ డబ్బును 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం వెచ్చించాలని అబ్దుల్ ముఖీత్ చందా, ఆయన కుటుంబం నిర్ణయించుకోవడం అభినందనీయమన్నారు. సర్ సయ్యద్ సొసైటీ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న అనాథ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారు.

## చిన్నారి మృతి.. తట్టుకోలేక నానమ్మకు గుండెపోటు

**విశ్వంభర, జనగామ:** జనగామ జిల్లా కేంద్రంలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. చిన్నారి మృతి చెందిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే నానమ్మ గుండె ఆగిపోయింది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన ప్రియాన్షి (18 నెలల) అనే చిన్నారి ఇంటి ఆవరణలో ఆడుకుంటూ వెళ్లి నీళ్ల సంపులో పడి మృతి చెందింది. మనవరాలి మృతితో ఏడుస్తూ నానమ్మ మారబోయిన నాగమ్మ (65) గుండెపోటుకు గురై మృతి చెందారు. ఒకే కుటుంబంలో ఇద్దరు చనిపోవడంతో అంబేడ్కర్ నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.


# రిపోర్టర్లు కావలెను

V3 NEWS | ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108